క్లుప్తంగా

విద్యార్థినికి ఎమ్మెల్యే అభినందనలు

నందిగామ టౌన్: ఢిల్లీలో నిర్వహించిన సైన్స్ ఎగ్జిబిషన్‌లో హ్యాబ్ పవర్ సేవింగ్ సిస్టం బై సోలార్ అనే అంశంపై ప్రతిభ కనబర్చి ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం సంపాదించిన నందిగామకు చెందిన మహ్మద్ సఫాన్ షాబాజ్‌ను ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య అభినందించారు. మండలంలోని మాగల్లు గ్రామ సమీపంలోని శ్రీవిద్యా పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో శుక్రవారం ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన పెంపొందించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

అధిక లోడుతో వెళ్తున్న ఇసుక లారీకి జరిమానా



తొర్రకుంటపాలెం(జగ్గయ్యపేట): అధిక లోడుతో వెళ్తున్న ఇసుక లారీకి జరిమానా విధించినట్లు ఎస్ఈబీ సీఐ మణికంఠ రెడ్డి శుక్రవారం తెలిపారు. మండలంలోని అనుమంచిపల్లి ఇసుక స్టాకు యార్డు నుంచి లారీ వస్తుండగా తనిఖీ చేశామన్నారు. అనుమానం వచ్చి సమీపంలోని వేబ్రిడ్జి వద్దకు తీసుకెళ్లగా స్టాకు యార్డులో ఇచ్చిన పర్మిట్ ప్రకారం లారీలో 20 టన్నుల ఇసుక ఉండాల్సి ఉండగా 37.04 టన్నుల ఇసుక ఉన్నట్లు గుర్తించి అధికంగా ఉన్న 17.04 టన్నుల ఇసుకకు టన్నుకు రూ. రెండు వేల చొప్పున రూ. 34,800 జరిమానా విధించినట్లు తెలిపారు. ఇసుక స్టాకు యార్డు వద్ద అధికారులు జాగ్రత్తగా ఉండాలని నిత్యం తనిఖీలు ఉంటాయని తెలిపారు. ఇసుక అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

మిక్ కాలేజ్ అధ్యాపకురాలికి డాక్టరేట్ ప్రదానం



కంచికచర్ల: మిక్ కాలేజ్ ఆఫ్ టెక్నాలజీలో అధ్యాపకురాలిగా పనిచేస్తున్న బి.మాధవి కోనేరు లక్ష్మయ్య (కేఎల్) యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ అందుకున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ టి.వంశీకిరణ్ శుక్రవారం తెలిపారు. మ్యాథమెటిక్స్ విభాగంలో సం స్టడీస్ ఆన్ సెమీ–అనలిటికల్ మెథడ్స్ ఫర్ క్యూ–ఫ్రాక్షనల్ డిఫరెంటియాల్ ఈక్వేషన్స్ అనే అంశంపై పరిశోధన చేసినందుకు మాధవికి డాక్టరేట్ లభించినట్లు తెలిపారు. దీంతో ఇంపార్టెంట్ ఇంజినీరింగ్ అండ్ ఫిజికల్ అప్లికేషన్స్‌ను సులభతరంగా సాల్వ్ చేయటం జరుగుతుందని పేర్కొన్నారు. డాక్టరేట్ లభించిన మాధవిని కళాశాల సీఈఓ డి. పాండురంగారావు, మేనేజ్‌మెంట్ సభ్యులు డాక్టర్ ఎం.సుహాస్ ఇతర అధ్యాపకులు అభినందించారు.

పోషణ ట్రాకర్‌లో లబ్ధిదారుల వివరాలు పొందుపరచాలి

రాష్ట్ర కో ఆర్డినేటర్ జె.సునీత

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పోషణ అభియాన్ కార్యక్రమంలో భాగంగా రూపొందించిన పోషణ ట్రాకర్‌లో లబ్ధిదారుల స్థితిని పొందుపరచాలని అంగన్‌వాడీ కేంద్రాల రాష్ట్ర కో ఆర్డినేటర్ జె.సునీత అన్నారు. పోషణ ట్రాకర్ అప్లికేషన్ నిర్వహణ, నమోదు పర్యవేక్షణలో భాగంగా అంగన్‌వాడీకేంద్రాల రాష్ట్ర కో ఆర్డినేటర్ జె. సునీత నగరంలోని బాడవపేట, నెహ్రూ నగర్ అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 0 నుంచి 6 సంవత్సరాల పిల్లల్లో పెరుగుదలను క్రమం తప్పకుండా ప్రతి నెలా పర్యవేక్షించడం చాలా ముఖ్యమన్నారు. పిల్లల్లో పోషకాహార లోపాన్ని ముందుగానే గ్రహించడానికి, సరైన పోషణను అందించడానికి తలిదండ్రులకు సహాయపడుతుందన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలు ప్రతి నెలా క్రమం తప్పకుండా పిల్లల సరైన ఎత్తు, బరువు వివరాలను అప్లికేషన్‌లో పొందుపరచాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రంలో నమోదు కానీ అర్హులైన లబ్ధిదారులందరిని కలిసి ప్రభుత్వం అందిస్తున్న సేవలపై అవగాహన కల్పించాలని తెలిపారు. రోజువారీ అంగన్‌వాడీ కేంద్రంలో జరిగే కార్యక్రమాల వివరాలను క్రమం తప్పకుండా అప్లికేషన్ లో పొందుపరచాలని సూచించారు. పర్యవేక్షణలో విజయవాడ సెక్టార్ సూపర్ వైజర్ రెహానా, కార్యకర్తలు సిబ్బంది పాల్గొన్నారు.

ఆరోగ్య బీమాను పునరుద్ధరించండి

విజయవాడస్పోర్ట్స్: న్యాయవాదుల హెల్త్ ఇన్సూరెన్స్‌ను పునరుద్ధరించాలని, సర్టిఫికెట్ ఆఫ్ ప్రాక్టీస్(సీవోపీ) విషయంపై న్యాయవాదులు పడుతున్న ఇబ్బందులను పరిష్కరించాలని కోరుతూ బార్ కౌన్సిల్ చైర్మన్ ద్వారకానాథ్‌రెడ్డికి బెజవాడ బార్ అసోసియేషన్(బీబీఏ) ప్రతినిధులు వినతిపత్రం అందజేశారు. హై కోర్టు ఆవరణలోని బార్ కౌన్సిల్ కార్యాలయంలో కౌన్సిల్ చైర్మన్ ద్వారకానాథ్‌రెడ్డి, కార్యదర్శి పద్మావతిని బీబీఏ ప్రతినిధులు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలుసుకుని వేర్వేరుగా వినతి పత్రాలు ఇచ్చారు.

పరిసరాల శుభ్రతతో సీజనల్ వ్యాధుల నివారణ

మున్సిపల్ కమిషనర్



జగ్గయ్యపేటలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న మున్సిపల్ కమిషనర్ నాగమల్లేశ్వరరావు

జగ్గయ్యపేట అర్బన్: వర్షాకాలం దృష్ట్యా దోమల వలన ప్రజలు డెంగీ, చికెన్ గున్యా, మలేరియా వంటి సీజనల్ వ్యాధుల బారిన పడకుండా అప్రమత్తంగా ఉండాలని, వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు తమ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని మున్సిపల్ కమిషనర్ సీహెచ్ నాగమల్లేశ్వరరావు తెలిపారు. ఫ్రై డే డ్రై డే కార్యక్రమంలో భాగంగా సీజనల్ వ్యాధులు ప్రబలకుండా, వర్షపు నీరు పరిసరాల్లో నిలవకుండా శుక్రవారం శానిటరీ ఇన్‌స్పెక్టర్ దుర్గాప్రసాద్, సచివాలయ శానిటరీ సెక్రటరీలు, ఆరోగ్య విభాగం సిబ్బందితో కలసి ఆయన వార్డుల్లో పర్యటించారు. గృహాల వద్ద పారిశుద్ధ్య పరిస్థితిని పరిశీలించారు. వైరల్ జ్వరాలు, డెంగీ, చికెన్ గున్యా, మలేరియా, డయేరియా వంటి వ్యాధులకు గురి కాకుండా ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పాటించాల్సిన ఆరోగ్య నియమాల గురించి అవగాహన కల్పించారు. కమిషనర్ మాట్లాడుతూ ప్రతి శుక్రవారం డ్రై డేని పాటిద్దామని, పరిసరాలను శుభ్రంగా ఉంచుకుందామన్నారు. తాగి పడవేసిన కొబ్బరి బోండాలు, టైర్లు, రోళ్లు, ఖాళీ పూల కుండీలు, ఫ్రిడ్జిలు, పాడైపోయిన కూలర్‌లలో నీటిని నిలువ ఉంచవద్దని సూచించారు. వాటిలో లార్వా ఏర్పడి దోమలు వృద్ధి చెందుతాయని తెలిపారు. వారానికి ఒకరోజు ఫ్రైడే రోజు నిలువ నీటిని ప్రజలు శుభ్రం చేసుకోవాలని తెలిపారు. గృహాల మధ్య ఉన్న ఖాళీ స్థలాలు అధ్వానంగా మారిపోయి దోమలకు ఆవాసాలుగా మారుతున్నాయని పేర్కొన్నారు. ఆయా ఖాళీ స్థలాల యజమానులు విధిగా తమ స్థలాలను శుభ్రంగా ఉంచుకోవాలని కోరారు. లేకుండా ఫైన్‌లు విధించి ఆ డబ్బులతో తామే ఖాళీ స్థలాలను శుభ్రం చేయించాల్సి వస్తుందన్నారు.

నందిగామ టౌన్: మన భద్రత కోసం అందరం తప్పనిసరిగా జాగ్రత్తలు పాటించాలని మున్సిపల్ కమిషనర్ హేమమాలిని తెలిపారు. కలెక్టర్ ఆదేశాల మేరకు పట్టణంలోని పలు ప్రాంతాల్లో శుక్రవారం ఫ్రైడే డ్రై డే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వర్షాలు కురుస్తున్నందున సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశముందని ప్రజలు అప్రమత్తంగా ఉండటంతో పాటు పరిశుభ్రత పాటించాలని సూచించారు. ప్రజలు చెత్తా చెదారాలను ఎక్కడపడితే అక్కడ పడేయకుండా విధిగా చెత్త కుండీలను వినియోగించాలని ముఖ్యంగా నీటి నిల్వ లేకుండా చూసుకోవాలని చెప్పారు. సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశమున్నందున మున్సిపల్ కార్యాలయంలో ప్రత్యేక సెల్ ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు, సచివాలయ హెల్త్ సెక్రటరీలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వర్షాకాలంలో అప్రమత్తంగా ఉండాలి



గాబుల్లో నీటిని నిల్వ ఉండకుండా చర్యలు తీసుకుంటున్న ఈఓపీఆర్డీ శ్రీనివాసరావు

కంచికచర్ల: ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా సీజనల్ వ్యాధులైన మలేరియా, డెంగీ వంటి వ్యాధులు ప్రబలకుండా ముందు జాగ్రత్తగా గ్రామాల్లో ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు ఈఓపీఆర్డీ బొజ్జగాని శ్రీనివాసరావు తెలిపారు. మండలంలోని గండేపల్లి, కీసర, గొట్టుముక్కల, కంచికచర్లలో ఫ్రైడే డ్రై డే కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఆరోగ్య సిబ్బందితో పాటు ఇంటింటికి వెళ్లి నీటిని నిల్వ ఉండకుండా చూడాలని తెలిపారు. సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఇళ్లలో వాడే కుండీల్లో గానీ, గాబుల్లో గానీ రెండు మూడు రోజులకు ఒకసారి నీళ్లు మార్చాలన్నారు. పాత టైర్లలో నీటిని నిల్వ ఉండకుండా చూడాలన్నారు. ప్లాస్టిక్ వంటి వస్తువులు, ఇంటి పరిసరాల్లో ఉండకుండా చూసుకోవాలన్నారు. ఎప్పటికప్పుడు చెత్తను నిల్వ ఉంచకుండా డంపింగ్ యార్డుకు తరలించాలన్నారు. రోడ్ల వెంబడి బ్లీచింగ్ సున్నం చల్లించాలని, దోమలు వ్యాప్తి చెందకుండా ఎబేట్‌ను పిచకారి చేయించాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



తొట్టెల్లో నీటిని తొలగిస్తున్న మున్సిపల్ ఆరోగ్య సిబ్బంది



వార్డుల్లో చేపట్టిన పారిశుద్ధ్య పనుల్లో కార్మికులు



ఫ్రైడే డ్రైడే కార్యక్రమంలో అధికారులు

పారిశుద్ధ్యంపై దృష్టి సారించాలి

ఎంపీపీ కోటేరు లక్ష్మి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ

వీరులపాడు: గ్రామాల్లో పంచాయతీ సిబ్బంది పారిశుద్ధ్య పనులు చేపట్టటంతో పాటు ప్రజలు కూడా సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎంపీపీ కోటేరు లక్ష్మి తెలిపారు. మండలంలోని జుజ్జూరు గ్రామంలోని ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వర్షాలు పడుతున్నందున స్వచ్ఛమైన తాగునీటిని ప్రజలకు సరఫరా చేయాలన్నారు. ఆయా గ్రామాల్లోని సమస్యలను సమావేశం దృష్టికి తీసుకొస్తే పరిష్కరించేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. అనంతరం పలు తీర్మానాలను సభ్యులు ఆమోదించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు వేమూరి ఆదాం, నాగుల్‌మీరా, ఎంపీటీసీ సభ్యులు ఇప్పల సత్యనారాయణ రెడ్డి, తోట నారాయణరావు, శీలం రమణారెడ్డి, మోండ్రు బాయమ్మ, మండూరి ప్రకాశరావు, పల్లెపోగు మార్తమ్మ, ఎంపీడీవో శివపార్వతీ, తహసీల్దార్ రాజకిషోర్, వ్యవసాయ శాఖ ఏవో జోగేంద్రప్రసాద్, వైద్యాధికారులు దీపిక, నందిని రెడ్డి, ఉద్యాన శాఖాధికారి నీలిమ, ఏపీవో జనార్దన్, సర్పంచ్‌లు, ఆయా శాఖల అధికారులు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

ఎడతెరపి లేకుండా వర్షం



పెనుగంచిప్రోలు: మండలంలో ఎడతెరపి లేకుండా వర్షాలు కురుస్తున్నాయి. దీంతో పొలాల్లో నీరు నిలిచింది. మరో రెండు రోజుల పాటు వర్షాకు కురుస్తాయన్న వాతావరణశాఖ ప్రకటనలతో చెరువులకు, మునేరుకు కూడా పూర్తి స్థాయిలో నీరు వస్తుందని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

కంచికచర్ల మండలంలో జోరుగా వర్షం

కంచికచర్ల : మండలంలో గత రెండు రోజుల నుంచి ఎడతెరపి లేకుండా వర్షం కురుస్తుంది. దీంతో రైతులు సాగు చేసిన మెట్టపైర్లకు, మాగాణి పంట పొలాలకు అనుకూలంగా ఉన్నా కాని మెట్ట పైర్లలో వర్షం నీరు నిలబడితే మొక్కలు ఎర్రబారి తెగులు ఆశిస్తాయి. కంచికచర్లలో 25.21 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయిందని రెవెన్యూ అసిస్టెంట్ స్టాటికల్ అధికారి ఎం దుర్గాప్రసాద్ శుక్రవారం తెలిపారు. అల్పపీడన ద్రోణి ప్రభావంతో ఎడతెరపి లేకుండా వర్షం కురుస్తుంది. ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాల కారణంగా మండలంలోని కీసర మున్నేరు, వైరా ఉపనదులకు వరదనీరు చేరింది. అయితే వర్షం నీరు నిల్వ ఉండకుండా చూడాలని వ్యవసాయశాఖ అధికారులు రైతులకు సూచిస్తున్నారు.

వైభవంగా నరసింహస్వామి పవిత్రోత్సవాలు

వేదాద్రి(జగ్గయ్యపేట): ప్రముఖ పుణ్యక్షేత్రం యోగానంద లక్ష్మీ నరసింహ స్వామి వారి ఆలయంలో స్వామి వారి పవిత్రోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. రాత్రి అర్చకులు స్వామి వారికి విశ్వక్షేణ పూజ, పుణ్యాహవచనం, అంకురార్పణ, వాస్తుపూజ, హోమాలు వంటి కార్యక్రమాలు నిర్వహించారు. దాదాపు మూడు గంటల పాటు హోమాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో హేమలతాదేవి, అర్చకులు, సిబ్బంది, కేసీపీ ప్రతినిధులు పాల్గొన్నారు.

కార్మికులకు రక్షణ కల్పించాలి

తహసీల్దార్‌కు సీఐటీయూ నేతల వినతిపత్రం



తహసీల్దార్ శేషగిరికి వినతిపత్రం అందజేస్తున్న సీఐటీయూ నాయకులు

జగ్గయ్యపేట అర్బన్: జగ్గయ్యపేట పరిసర ప్రాంతాల్లో ఉన్న వివిధ ఫ్యాక్టరీల్లో పనిచేసే కార్మికులకు కనీస భద్రతతో పాటు కార్మిక చట్టాలు అమలు చేయకపోతున్నప్పటికీ సంబంధిత అధికారులు పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వహించడం దుర్మార్గమని సీఐటీయూ జిల్లా నాయకులు అన్నారు. ఈ సందర్భంగా శుక్రవారం సీఐటీయూ జిల్లా నాయకులు ఎం.సోమేశ్వరరావు, మండల నాయకులు రాంప్రసాద్, కోట కృష్ణ పేట తహసీల్దార్ శేషగిరిని ఆయన కార్యాలయంలో కలసి వినతిపత్రాన్ని అందజేశారు. 10 రోజుల క్రితం బూదవాడలోని అల్ట్రాటెక్ సిమెంట్ ఫ్యాక్టరీలో ప్రమాదం జరిగి నలుగురు చనిపోయి, 16 మంది గాయపడ్డారని తెలిపారు. ఈ సంఘటన మరువక ముందే ధర్మవరప్పాడు గ్రామంలోని రామ్‌కో సిమెంట్స్ ఫ్యాక్టరీలో ఒక కార్మికుడు మృతి చెందాడని తెలిపారు. తరచూ ఇటువంటి ఘటనలు ఫ్యాక్టరీల్లో జరుగుతుంటే అధికాకరులు ఎందుకు స్పందించడంలేదని ప్రశ్నించారు. భవిష్యత్‌లో సంఘటనలు పునరావృతం కాకుండా ఫ్యాక్టరీల్లో కార్మికులకు కనీస భద్రత కల్పించాలని, ప్రమాదాలను నివారించాలని కోరారు. అనంతరం రామ్‌కో సిమెంట్స్‌లో రోడ్డు ప్రమాదం జరిగి మృతి చెంది స్థానిక ప్రభుత్వాస్పత్రిలో ఉన్న కార్మికుడు మూఢావత్ నాగులు మృతదేహాన్ని సీఐటీయూ నాయకులు సందర్శించి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు జి. గోపినాయక్ తదితరులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి నష్ట పరిహారం



మృతుడు నాగులు కుటుంబానికి చెక్కు, ఒప్పంద పత్రాలను అందజేస్తున్న రామ్‌కో ప్రెసిడెంట్

జగ్గయ్యపేట: గ్రామంలోని రామ్‌కో సిమెంట్స్ కర్మాగారం (ఎంసిఎల్)లో గురువారం క్లీనింగ్ వాహనం ఢీకొని మృతి చెందిన జయంతిపురం గ్రామానికి చెందిన మాడావత్ నాగులు కుటుంబానికి యాజమాన్యం రూ. 12 లక్షల నష్ట పరిహారం చెల్లించింది. శుక్రవారం కర్మాగారంలోని అడ్మినిస్ట్రేషన్ భవనంలో కుమార్తె సంధ్య శ్రీ, కుమారుడు నరసింహలకు కర్మాగారం ప్రెసిడెంట్ ఆశిష్ కుమార్ శ్రీవాత్సవ, సిబ్బంది నగదు అందించారు. అదే విధంగా మృతుడి కుమారునికి చదువుల అనంతరం ఉద్యోగంతో పాటు భార్యకు ప్రతి నెలా పింఛన్ ఇచ్చేలా ఒప్పంద పత్రాలను సైతం అందజేశారు. ఈ కార్యక్రమంలో జనరల్ మేనేజర్ ఫరూక్, హెచ్‌ఆర్ రామకృష్ణ సాయి, సీనియర్ డీజీఎం కార్తికేయన్, కౌన్సిలర్ సామినేని వెంకట కృష్ణ ప్రసాద్, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ కుమార్ రాజా, టీడీపీ నాయకుడు శ్రీరాం ధనుంజయ, తహసీల్దార్ శేషగిరి, తదితరులు పాల్గొన్నారు. కర్మాగారంలో క్లీనింగ్ వాహనం నిర్లక్ష్యంగా నడుపుతూ మృతికి కారకుడైన డ్రైవర్ నాగేశ్వరరావుపై కేసు నమోదు చేసినట్లు చిల్లకల్లు ఎస్ఐ సతీష్ శుక్రవారం తెలిపారు.

రేపు 'సుఖమంచి'కి రంగస్థల పురస్కారం

విజయవాడ కల్చరల్: రంగస్థల నటుడు, దర్శకుడు సుఖమంచి కోటేశ్వరరావుకు తంగిరాల కృష్ణప్రసాద్ స్మారక రంగస్థల పురస్కారాన్ని ఈ నెల 21వ తేదీ ఆదివారం సాయంత్రం అందజేస్తున్నట్లు తంగిరాల మెమోరియల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు తంగిరాల ప్రసన్న చక్రవర్తి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ట్రస్ట్ స్వర్ణోత్సవం సందర్భంగా ప్రత్యేక కార్యక్రమం ఏర్పాటు చేశామన్నారు.

శ్రేష్ట ప్రవేశ పరీక్షలో ప్రతిభ



జగ్గయ్యపేట అర్బన్: జాతీయ స్థాయిలో శ్రేష్ట ప్రవేశ పరీక్షలో ప్రతిభ కనపరచిన విద్యార్థిని కేడీసీసీ బ్యాంకు జగ్గయ్యపేట బ్రాంచ్ సిబ్బంది అభినందించారు. నందిగామ మండలం, అంబారుపేట గ్రామానికి చెందిన మారబత్తుల రామారావు కుమార్తె అక్షిత 2024 మే 11 వ తేదీన జాతీయ స్థాయిలో నిర్వహించిన శ్రేష్ట ప్రవేశ పరీక్షలో ఆలిండియా 304 ర్యాంకు సాధించింది. ఈ సందర్భంగా శుక్రవారం బ్యాంకు కార్యాలయంలో జరిగిన అభినందన కార్యక్రమంలో బ్రాంచ్ చీఫ్ మేనేజర్ కొండూరు రమేష్ విద్యార్థి అక్షితను సత్కరించారు. ఇలాగే అందరు విద్యార్థులు పట్టుదలతో విజయం సాధించాలని మేనేజర్ కోరారు. ఇలాంటి పేద విద్యార్థులకు కోచింగ్ ఇవ్వడం, వారు ప్రతిభ కనపరచి విజయం సాధించడం తమకు గర్వకారణమని స్థానిక ప్రగతి కోచింగ్ సెంటర్ కన్వీనర్ కొండ్రు మనోజ్‌కుమార్ తెలిపారు. కార్యక్రమంలో బ్యాంకు ఫీల్డ్ ఆఫీసర్ ప్రసాద్, అసిస్టెంట్ మేనేజర్లు శిరీష, శ్రీను, షణ్ముకకుమార్, చైతన్య, సంఘమయ్య, విద్యార్థి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

స్వచ్ఛ జగ్గయ్యపేటే లక్ష్యం

–మున్సిపల్ కౌన్సిలర్ రాఘవేంద్ర



స్వచ్ఛ భారత్ ఎండీ గంధం చంద్రుడుని కలిసి వినతిపత్రం అందజేస్తున్న రాఘవేంద్ర

జగ్గయ్యపేట అర్బన్: పట్టణంలో పబ్లిక్ టాయిలెట్స్ నిర్మాణానికి నిధులు కేటాయించాలని మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర కోరారు. ఈ మేరకు శుక్రవారం విజయవాడ పట్టణంలోని స్వచ్ఛభారత్ ఎండీ గంధం చంద్రుడుని కలిసిన మున్సిపల్ చైర్మన్ రాఘవేంద్ర ఆయనకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ జగ్గయ్యపేట పట్టణానికి పరిశుభ్రంగా ఉంచడానికి తమ వంతు కృషి చేస్తున్నామని తెలిపారు. కాంపాక్టర్ బిన్‌లు రిపేరు, కొత్తవి ఏర్పాటుచేయడానికి, పబ్లిక్ టాయిలెట్ల నిర్మాణానికి ప్రత్యేక నిధులు కేటాయించాలని కోరారు. జగ్గయ్యపేట నియోజకవర్గ ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) సహకారంతో స్వచ్ఛ భారత్ ఎండీని కలిసి వినతిపత్రం అందజేసినట్లు తెలిపారు. అలాగే యాడ్వర్స్ సీజనల్ గ్రాంట్ ద్వారా వాటర్ హెడ్ వర్క్స్ వద్ద నూతన మోటార్లు కొనుగోలు చేయడానికి జిల్లా కలెక్టర్ సృజనను కలసి వినతిపత్రం అందజేసినట్లు తెలిపారు. దీనిపై వారిద్దరూ స్పందించారని, త్వరలోనే నిధులు కేటాయించేలా చర్యలు తీసుకుంటామని తెలియజేసినట్లు పేర్కొన్నారు. చైర్మన్ వెంట మున్సిపల్ కౌన్సిలర్ పేరం సైదేశ్వరరావు, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

రహదారికి మరమ్మతులు చేయరూ!



భీమవరం వద్ద పూర్తిగా దెబ్బతిన్న రహదారి

వత్సవాయి: మక్కపేట–భీమవరం రహదారి అధ్వానంగా మారింది. ఈ మార్గం గుండా ప్రయాణం చేయాలంటే వాహనచోదకులు ఇబ్బందులకు గురవుతున్నారు. రహదారులపై గుంతలు పడడంతో పాటు వర్షాకాలం కావడంతో నీరు నిలబడి మరింత అసౌకర్యంగా మారింది. గుంతల్లో నీరు నిలబడటంతో లోతు అంచనావేయలేక దాంట్లో దిగి ప్రమాదాల బారిన పడుతున్నారు. చిల్లకల్లు వద్ద టోల్‌ప్లాజా రుసుం తప్పించుకోవడానికి ఈ మార్గం గుండా వరంగల్, ఖమ్మం జిల్లాలకు చెందిన వాహనాలు ఎక్కువగా రాకపోకలు సాగిస్తుంటాయి. భారీ వాహనాలు కూడా ఇటువైపు వస్తుండడంతో రహదారి ధ్వంసం అయింది. రాత్రి సమయాల్లో మరింత అవస్థలు పడుతున్నట్లు వాహనదారులు చెబుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి రహదారికి మరమ్మతులు నిర్వహించాలని ప్రజలు కోరుతున్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో సంపూర్ణ పోషకాహారం



పోషకాహారం అందిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

పెనుగంచిప్రోలు: అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు సంపూర్ణ పోషకాహారం అందుతుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఉషారాణి అన్నారు. శుక్రవారం గ్రామంలోని 6 నుంచి 12 వ అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆస్పిరేషన్ బ్లాక్‌లో భాగంగా సంపూర్ణత అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణీలకు పోషకాహారంపై అవగాహన కల్పించటంతో పాటు పోషకాహార కిట్లు అందజేశారు. గర్భిణులు చేయించుకోవాల్సిన రిజిస్ట్రేషన్‌పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.

భక్తుల సౌకర్యాలకు అధిక ప్రాధాన్యం



సమావేశంలో పాల్గొన్న ఈవో రమేష్‌నాయుడు, చైర్మన్ శ్రీనివాసరావు, పాలకవర్గ సభ్యులు

పెనుగంచిప్రోలు: భక్తుల సౌకర్యాలకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నామని ఆలయ ఈవో కె.రమేష్‌నాయుడు, చైర్మన్ జంగాల శ్రీనివాసరావు తెలిపారు. గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీతిరుపతమ్మవారి ఆలయ పాలకవర్గ సమావేశం శుక్రవారం ఆలయ ధర్మకర్తల చాంబర్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా పలు అంశాలపై చర్చించటంతో పాటు పలు తీర్మానాలు చేశారు. ఆలయం వద్ద వివిధ వ్యాపారాల లైసెన్స్ హక్కులకు సంబంధించి మొత్తం 13 సర్క్యులర్ అజెండాలను ఆమోదించారు. అమ్మవారి ఆలయం లోపల బేడా మండపం చుట్టూ దాతల సహకారంతో గ్రానైట్ స్టోన్ వేయించేందుకు ప్రత్యేకంగా ఒక బ్యాంక్ ఖాతా ఏర్పాటుకు తీర్మానం చేశారు. ఆలయంలో వివిధ విభాగాల్లో పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్ సిబ్బంది జీతాలు పెంపునకు, నందిగామ తహసీల్దార్ కార్యాలయం వారి ఫైల్‌ను అనుసరించి మాదిగ కులస్తులు ఇచ్చిన వినతి ప్రకారం దేవస్థాన నిర్మాణానికి భూమి సమకూర్చిన చింతయ్య మాదిగ వారి శిలాఫకం ఏర్పాటుకు చర్యలు తీసుకొనుటకు, ఫాల్గుణ పౌర్ణమి రోజున అమ్మవారికి తొలిబోనం సమర్పించేందుకు పాలకవర్గం తీర్మానించింది. అలాగే దేవస్థాన ప్రాంగణంలో క్యాంటీన్ పక్కన గల దుకాణాల సముదాయం స్థలంలో సీసీ కెమేరాలు, లైటింగ్ ఏర్పాటుకు నిర్ణయించారు. ఈ సందర్భంగా ఆలయ ఈవో, చైర్మన్ మాట్లాడుతూ భక్తుల శ్రేయస్సే లక్ష్యంగా అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈఈ వైకుంఠరావు, ఏఈవో ఉమాపతి, తిరుమలేశ్వరరావు, ఏఈ రాజు, పాలకవర్గ సభ్యులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

అల్ట్రాటెక్ కర్మాగారంలో కమిటీ విచారణ



ప్రమాద స్థలాన్ని పరిశీలిస్తున్న విచారణ కమిటీ సభ్యులు

బూదవాడ(జగ్గయ్యపేట): గ్రామంలోని అల్ట్రాటెక్ కర్మాగారంలో కలెక్టర్ సృజన నియమించిన విచారణ కమిటీ సభ్యులు కర్మాగారాన్ని సందర్శించారు. ఈ నెల ఏడున బాయిలర్ పేలుడు ప్రమాదంలో 16 మందికి తీవ్ర గాయాలు కాగా వారిలో నలుగురు మృతి చెందగా ఏడుగురు డిశ్చార్జ్ అవగా ఐదుగురు విజయవాడలో చికిత్స పొందుతున్నారు. ఈ క్రమంలో కలెక్టర్ ప్రమాద సమయంలో కర్మాగారంలో పర్యటించి విచారణ కమిటీని నియమించారు. ఉదయం నుంచి రాత్రి వరకు పేలుడు ప్రదేశాన్ని, ప్రమాదానికి కారణాలను కర్మాగారంలోని టెక్నికల్ సిబ్బందిని విచారించారు. విచారణ మరో రెండు విడతల్లో ఉంటుందని అధికారులు చెప్పారు. ఈ కార్యక్రమంలో నందిగామ ఆర్డీవో రవీంద్రరావు, డిప్యూటీ చీఫ్ ఇండస్ట్రియల్ ఫ్యాక్టరీస్ ఎంపీఎస్ రెడ్డి, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఈఈ శ్రీనివాస్, లేబర్, విద్యుత్, ఫైర్, రెవెన్యూ అధికారులు, ప్లాంట్ సిబ్బంది పాల్గొన్నారు.

స్టాంప్ వెండర్ల సమస్యలు పరిష్కరించండి



మంత్రి అనగానికి సమస్యలు వివరిస్తున్న రాంబాబు

జగ్గయ్యపేట అర్బన్: స్టాంప్ వెండర్ల సమస్యలు పరిష్కరించాలని ఏపీ స్టాంప్ వెండర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ కీసర రాంబాబు కోరారు. ఈ సందర్భంగా శుక్రవారం రాష్ట్ర రెవెన్యూ, స్టాంప్స్, రిజిస్ట్రేషన్ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్‌ను అమరావతిలోని మంత్రి కార్యాలయంలో కలసి వినతిపత్రాన్ని అందజేసినట్లు తెలిపారు. ఈ–స్టాంపింగ్ వలన ప్రజలు, స్టాంప్ వెండర్లు పడుతున్న ఇబ్బందులను గురించి వినతిపత్రం ద్వారా మంత్రికి తెలియజేసినట్లు తెలిపారు. తప్పకుండా దీనిపై చర్చించి నిర్ణయం తీసుకుంటామని మంత్రి సత్యప్రసాద్ హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు.